నామినేషన్లు ఉపసంహరణ

- ఎక్కువ మంది స్వాతంత్య్ర అభ్యర్థులే..
- పినపాకలో కాంగ్రెస్‌కు తప్పిన రెబల్ బెడద

మణుగూరుటౌన్: ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజు మణుగూరు నియోజకవర్గం నుంచి నాలుగు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఒకరు కాంగ్రెస్ రెబల్ స్వతంత్య్ర అభ్యర్థి బట్టా విజయ్ గాంధీ (బూర్గంపహాడ్) కాగా, మిగతా వారు మాలోతు సువర్ణ (రాజుపేట, మణుగూరు), పూణెం రంగయ్య (గుండాల), వర్సా శ్రీనివాస్ (మణుగూరు)లు ఉపసంహరించుకున్న వారిలో ఉన్న ఐటీడీఏ పీఓ, రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ బుధవారం ధ్రువీకరించారు. ఆది నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశావహుడిగా ఉంటూ నామినేషన్ రెండు సెట్లు దాఖలు చేసిన బట్టా విజయ్‌గాంధీ నామినేషన్ విత్‌డ్రా చేసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు తొగ్గూడెంలో భవన నిర్మాణ కార్మికులతో జరుగుతున్న సమావేశానికి చేరుకున్నారు. పాయంతో కలిసి ప్రయాణం.. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం అందరూ శ్రమిద్దాం.. అంటూ ప్రకటించడంతో కాంగ్రెస్ వర్గాలు అన్ని ఏకతాటిపైకి వచ్చినట్లయింది.



అశ్వారావుపేట: నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న సున్నం నాగమణి

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో ఉన్న వారిలో మరో ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను బుధవారం ఉపసంహరించుకున్నట్లు స్థానిక రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు తెలిపారు. మొత్తం 23 నామినేషన్లు దాఖలు కాగా స్క్రూటినీలో సీపీఐ(ఎం) డమ్మీ అభ్యర్థి, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థి నామినేషన్లు తిరస్కరించగా, మిగిలిన 21 మందిలో మరో ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. దాంతో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల బరిలో అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి 14 మంది అభ్యర్థులు బరి ఉన్నట్లు చెప్పారు.



మణుగూరుటౌన్: నామినేషన్ విత్‌డ్రా చేసుకుంటున్న బట్టా విజయ్‌గాంధీ



మణుగూరురూరల్: నామినేషన్‌ను ఉపసంహరించుకుంటున్న మాలోత్ సువర్ణ

ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు

మణుగూరుటౌన్: ప్రతీ పేదవానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందని, గతంలోనూ ఈ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించింది కేవలం కాంగ్రెస్ మాత్రమేనని పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం తోగ్గూడెంలో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి సీపీఐ రాష్ట్ర నాయకుడు బొల్లోజు అయోధ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలతో కలిసి హాజరైన పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నిత్య సమస్యలు ఎదుర్కొనే భవన నిర్మాణ కార్మికులను తెలంగాణ ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, కాంగ్రెస్ పార్టీ పాలనలోనే పినపాక నియోజకవర్గంలో వివిధ రకాలుగా 10వేల ఇందిరమ్మ ఇల్లు నిర్మించిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం యువతను నిరుద్యోగులుగానే ఉంచుతూ మద్యానికి బానిసలుగా చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను వివరించారు. రేషన్ కార్డులు, దళిత ముఖ్యమంత్రి, నిరుద్యోగ భృతి, ఉద్యోగ నోటిఫికేషన్లు, డబల్‌బెడ్రూం వంటి టీఆర్ఎస్ పార్టీ హామీలు మాటలకే పరిమితమైన విషయాలు ప్రజలు గుర్తించాలన్నారు.

హస్తం గూటికి దమ్మక్కపేట సర్పంచ్..

మణుగూరు మండలం దమ్మక్కపేట పంచాయతీ సర్పంచ్ కుర్సం రాంబాబు, ఉప సర్పంచ్ పడిగల వెంకటేశ్వర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర నాయకులు బొల్లోజు అయోధ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, సామా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరారు. కాంగ్రెస్ కండువా కప్పి పాయం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు 200 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. కార్యక్రమాల్లో కేవీ రావు, నాయకులు పుచ్చకాయలశంకర్, పీరినాకి నవీన్, బీరం సుధాకర్‌రెడ్డి, భవన నిర్మాణ కార్మికులు, దమ్మక్కపేట, చిక్కుడుగుంట గ్రామస్తులు పాల్గొన్నారు.



మణుగూరుటౌన్: దమ్మక్కపేట సమావేశంలో మాట్లాడుతున్న పాయం వెంకటేశ్వర్లు

రేపు రాహుల్ గాంధీ రోడ్ షో

ఏఐసీసీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ శుక్రవారం ఉదయం మణుగూరులో రోడ్‌షో, స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు హాజరుకానున్నట్లు పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన సీపీఐ రాష్ట్ర నాయకులు బొల్లోజు అయోధ్య, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యలతో కలిసి మాట్లాడారు. సమావేశానికి నియోజకవర్గ ప్రజలు, కాంగ్రెస్, సీపీఐ నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, కేవిరావు, పప్పుల జాన్, సరెడ్డి పుల్లారెడ్డి, పుచ్చకాయల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు గుర్తులు కేటాయింపు

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీలో నిలిచిన అభ్యర్థులకు బుధవారం అశ్వారావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు గుర్తులు కేటాయించారు. నియోజకవర్గం నుంచి మొత్తం 14 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులను ఖరారు చేశారు. సీపీఎం పార్టీ అభ్యర్థి పిట్టల అర్జున్‌కు (సుత్తి కొడవలి, నక్షత్రం), కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారే ఆదినారాయణకు (హస్తం), బీఎస్పీ అభ్యర్థి మడకం ప్రసాద్‌కు (ఏనుగు), బీఆర్ఎస్ అభ్యర్థి మెచ్చా నాగేశ్వరరావుకు(కారు), గోండ్వాన దండకారణ్య పార్టీ అభ్యర్థి ఊకే రవికి(తురా ఊదుతున్న మనిషి), గోండ్వాన ఘనతంత్ర పార్టీ అభ్యర్థి కన్నెబోయిన వెంకటనర్సయ్యకు(రంపం), అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రీఫామ్స్ పార్టీ అభ్యర్థి పద్దం వెంకట రమణకు(చపాతి రోలర్), భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి మనుగొండ వెంకట ముత్యం(గన్నా కిసాన్), జనసేన పార్టీ అభ్యర్థిని ముయ్యబోయిన ఉమాదేవికు(గ్లాస్ టంబ్లర్), స్వతంత్ర అభ్యర్థులైన అంగోతు కృష్ణకు(బ్యాట్), ఊకే ముక్తేశ్వరరావుకు(బిస్కెట్), కిషోర్ కల్లూరికు (కత్తెర), కుంజా నాగమణికి(గ్యాస్ సిలిండర్), తంబళ్ల రవికు(స్కెతస్కోప్) గుర్తులను కేటాయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కృష్ణ ప్రసాద్ ఉన్నారు.

మణుగూరురూరల్: ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 18మంది పినపాక అసెంబ్లీ స్థానానికి పోటీలో ఉండగా.. వారికి గుర్తులు కేటాయించారు. ఈ మేరకు పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ వివరాలు వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రేగా కాంతారావుకు కారు, కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లుకు హస్తం, బీజేపీ అభ్యర్థి పొడియం బాలరాజుకు కమలం, బీఎస్పీ అభ్యర్థి వజ్జా శ్యాములకు ఏనుగు, ఆబాద్ అభ్యర్థి ఆలెం వెంకటేశ్వర్లుకు సీసీటీవీ కెమెరా, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి కుంజా దుర్గకు గన్నా కిసాన్, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి గుగులోత్ రమేష్‌కు బ్యాట్, గొండ్వానా దండకారణ్య పార్టీ అభ్యర్థి వజ్జా జ్యోతిబసుకు తూర ఊదుతున్న మనిషి, స్వతంత్ర అభ్యర్థులు అల్లెం నరేంద్ర(కోటి)కి టీవీ రిమోట్, ఊకె ముద్దరాజుకు గ్యాస్ సిలిండర్, ఈసం కృష్ణకు కత్తెర, కుంజా కృష్ణారావుకు ల్యాప్‌టాప్, కొడెం వెంకటేశ్వర్లుకు టెలివిజన్, జబ్బా కృష్ణకు ఆపిల్, పాల్వంచ దుర్గకు రోడ్ రోలర్, పూనెం రాజేష్‌కు ఏడురేఖలతో కలంపాళి, బానోత్ జగ్గారావు గ్లాస్ టంబ్లర్, వాసం మంగయ్యకు కుట్టుమిషన్ గుర్తులను కేటాయించామన్నారు.

జారెకు మద్దతుగా ప్రచారం



అన్నపురెడ్డిపల్లి: కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం..



అశ్వారావుపేటరూరల్: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దమ్మపేట: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి జారే ఆదినారాయణకు మద్దతుగా, టీడీపీ, సీపీఐ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీతో కలసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బుధవారం నల్లకుంట గ్రామంలో గడపగడపకు ప్రచారం నిర్వహించి ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. చేతి గుర్తుకు ఓటేసి, జారే ఆదినారాయణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, చక్రాల మల్లేశ్వరరావు, వలీపాషా, ఊకే కుమారి, రాజిని లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారె ఆదినారాయణను గెలిపించాల్సిందిగా ఆ పార్టీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోడా పద్మ, పర్సా వెంకటేశ్వర్లు, బాణావత్ భీముడు, లాలు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జారే ఆదినారాయణను అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాలని ఆ పార్టీ ప్రముఖ నాయకులు జూపల్లి రమేష్, మొగళ్లపు చెన్నకేశవరావు కోరారు. ఈ మేరకు బుధవారం అశ్వారావుపేటలోని పలు వార్డుల్లో ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ అమలు చేసే ఆరు గ్యారెంటీ కార్డులను వివరించారు. అలాగే మండలంలోని పేరాయిగూడెం, మోడల్ కాలనీ, ఆసుపాక, వినాయకపురంతోపాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. కోఆప్షన్ సభ్యులు ఎస్‌కే పాషా, ఎంపీటీ సీ వేముల భారతి, నాయకులు జ్యేష్ట సత్యనారాయణ, తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, టీడీపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరి కోత ప్రయోగం



వరి కోస్తున్న తహసీల్దార్ రాఘవరెడ్డి

మణుగూరురూరల్: మండల పరిధిలోని గుట్టమల్లారం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 49లో ఉన్న కారం ముత్తయ్య వరి పొలంలో బుధవారం ప్లానింగ్‌శాఖ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగం నిర్వహించారు. తహసీల్దార్ వి.రాఘవరెడ్డి స్వయంగా వరి కోసం పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. నిర్ణీత విస్తీర్ణంలో వరిని కోసి ఎంత పంట వచ్చిందో సంబంధింత పద్ధతి లేక్క తేల్చి.. ఆ చొప్పున ఎకరాకు ఎంత దిగుబడి వస్తుందో అంచనా వేయడమే ఈ ప్రయోగ సారాంశం. ఈ మేరకు బుధవారం చేసిన ప్రయోగంలో ఎకరాకు 25బస్తాల వరిధాన్యం వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. దీని ద్వారా భవిష్యత్ ఆహార నిల్వలు, ఉత్పత్తి అంచనా వేయవచ్చని ఈ సదర్భంగా ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా ప్రణాళిక అధికారి, ఏఎస్ఓ పాల్గొన్నారు.

కొండరెడ్లకు వైద్య పరీక్షలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాత రెడ్డిగూడెం గ్రామంలో వినాయకపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ పర్యవేక్షణలో 48 మంది కొండరెడ్లకు ఆరోగ్య పరీక్షలు చేసి చిరు వ్యాధులతో బాధ పడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి అజ్మీర వెంకటేశ్వరరావు, సిబ్బంది శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని పాతనారాయణరావుపేట గ్రామంలో ఆర్లగూడెం ఆయుర్వేద వైద్యురాలు ఉషారాణి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణి మాట్లాడారు. కార్యక్రమంలో సిబ్బంది ఈశ్వరి, ఏఎన్ఎం సరోజిని, ఆశావర్కర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల కేంద్రంలో కాలువబజార్‌కు చెందిన చెట్టి సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో బుధవారం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, వైస్ ఎంపీపీ వీరభద్రం ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు రావుల రాధమ్మ, జూపల్లి కిరణ్, సహదేవ్, రాయపూడి రాజేష్, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, యువజన నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 'సామాన్యుడి కోసం కేసీఆర్ సంకల్పం', బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను కాంతారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కాగా, మండలంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విప్ రేగా కాంతారావు సమక్షంలో అశ్వాపురం మండలం కల్యాణపురం, రామచంద్రాపురం, బట్టీల గుంపు గ్రామాలకు చెందిన సుమారు వంద కుటుంబాల వారు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ప్రచారం..

పినపాక: ఎన్నికల్లో తనను గెలిపించాల్సిందిగా.. మండలంలో ఎమ్మెల్యే, పినపాక బీఆర్ఎస్ అభ్యర్థి రేగా కాంతారావు బుధవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఉదయం దుగినేపల్లి సమ్మక్క సారలమ్మ దేవాలయం వద్ద పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, భద్రయ్య, వాసు బాబు, పోలిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

అశ్వాపురం: రేగా కాంతారావు గెలుపును కాంక్షిస్తూ.. బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నవీన్‌బాబు మండల పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు.



పినపాక: పొట్లపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

మృతుడి కుటుంబానికి పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామానికి చెందిన వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ఇటీవల మృతి చెందగా బుధవారం దశదిన కర్మ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు, ఆయన సతీమణి సుధారాణి హాజరై వెంకటేశ్వరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, సర్పంచ్‌లు పర్శిక రాజమ్మ, మద్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఈదర సత్యనారాయణ, జాలె రామకృష్ణారెడ్డి, దైదా నారాయణరెడ్డి, సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్

మణుగూరురూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ, పినపాక ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల బరిలో ఉన్న 18 మంది అభ్యర్థులతో ఎన్నికల సాధారణ పరిశీలన అధికారి ఎస్.హరికిషోర్ సమక్షంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ.. అభ్యర్థులు ప్రతీ రోజు వెచ్చించే ఖర్చుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రచారానికి అనుమతులుండాలని తెలిపారు. ఎన్నికల ఖర్చుకు రూ.40 లక్షలు దాటకూడదని సూచించారు. 80 సంవత్సరాల పైబడిన వయోవృద్ధుల హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. దేశంలో మొదటిసారిగా హోమ్ ఓటింగ్ తెలంగాణాలోనే నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.రాఘవరెడ్డి, ఎలక్షన్ సెల్ నాగరాజు, ఆర్ఎఫ్ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

బూర్గంపాడు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. బుధవారం లక్ష్మీపురంలో ఎస్సై నాగముత్యం ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తుల సమాచారం సేకరించారు.

బీజేపీ నాయకుడి కారు తనిఖీ

దమ్మపేట: ఏపీ రాష్ట్రానికి చెందిన బీజేపీ రాష్ట్ర నాయకుడు సోము వీర్రాజు కారును ఎఫ్ఎస్ టీం ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం ఆంధ్ర ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు సోము వీర్రాజు వైజాగ్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా, మార్గమధ్యలో మండలపల్లి చెక్‌పోస్ట్ వద్ద ఆయన కారును ఆపిన పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీలో ఎటువంటి నగదును గుర్తించలేదని ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ తెలిపారు.



దమ్మపేట: మండలపల్లిలో సోము వీర్రాజు కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

భద్రాచలంటౌన్: పట్టణంలోని సిటీ స్టైల్ జిమ్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో ఈ నెల 19న జరిగే రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు 9 మంది క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు.

కాంగ్రెస్ మాల కమ్యూనిటీ అధ్యక్షుడిగా కిరణ్

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ మాల కమ్యూనిటీ కమిటీ అధ్యక్షుడిగా బర్ల కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మల్లెలమడుగు గ్రామం ఎస్సీ కాలనీలో బుధవారం కాంగ్రెస్ పార్టీ మాల కమ్యూనిటీ ముఖ్య కార్యకర్తల సమావేశం బేతం బాబు, బర్ల మధు అధ్యక్షతన నిర్వహించారు. అధ్యక్షుడిగా బర్ల కిరణ్, కార్యవర్గ సభ్యులుగా బండి సిద్ధు, పుల్లగిరి వెంకటేష్, పిట్టా ప్రశాంత్, దాసరి జయకృష్ణ, బర్ల మధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఎంపీటీసీ బేతం రామకృష్ణ, గుర్రం చెన్నయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రచార పోస్టర్లు ఆవిష్కరణ

అశ్వారావుపేటరూరల్: కార్తీక వన సమారాధాన ప్రచార పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. మండలంలోని వేదాంతపురం అటవీ ప్రాంతంలోని వనదుర్గాంభిక సమేత వన లింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 26న జరిగే కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీని ప్రచార పోస్టర్లను అశ్వారావుపేట సీఐ కరుణాకర్, ఎస్సై పి.శ్రీకాంత్ చేతుల మీదుగా ఆవిష్కరించి విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సోని శివశంకర్ ప్రసాద్, ఆలయ కమిటీ బాధ్యులు సంగీతం వీర్రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చర్ల: మండలంలోని సత్యనారాయణపురంలో బుధవారం రాత్రి గ్రామపంచాయతీ సర్పంచ్ కారం పుల్లయ్య ఉప సర్పంచ్ వీర్రాజుతో పాటు 60 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, జవ్వాది రవికుమార్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాళ్లగూడెంలో జరిగిన కార్యక్రమంలో యాలం ఇంటి పేరుతో గల 20 కుటుంబాల వారు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి జెడ్పీటీసీ ఇర్పా శాంత, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, రామకృష్ణ పార్టీలో చేర్చుకున్నారు.

వాడవాడలా పార్టీల ప్రచారం

చర్ల: భద్రాచలంలో కాంగ్రెస్‌కు ఓటెయ్యాలని కోరుతూ ఎమ్మెల్యే, భద్రాచలం కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మంగళవారం రాత్రి చర్ల మండలంలో పర్యటించారు. గోళ్లగట్టులో కాంగ్రెస్‌లో చేరిన 100 కుటుంబాల వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాదరావు, జెడ్పీటీసీ సభ్యురాలు ఇర్పా శాంత, పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, డీసీఎంఎల్ డైరెక్టర్ పరుచూరి రవికుమార్, ఎంపీటీసీ మడకం పద్మ, తాటి జ్యోతి పాల్గొన్నారు.

భద్రాచలంఅర్బన్: భద్రాచలం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యను గెలుపు కోరుతూ.. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీలంక అశోక్ నగర్, కొత్త కాలనీల్లో ప్రచారం నిర్వహించారు. పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు వెంకట రామారావు, సంతోష్, శాఖ సభ్యులు సతీష్ బాబు, పుణ్యవతి, గణపతి అమ్మ, గౌతమి, రవణమ్మ, సులోచన, రజిని పాల్గొన్నారు.

చంద్రుగొండ: చెరుకురైతు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాల్సిందిగా కోరుతూ.. భారత చైతన్య యువజనపార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ అభ్యర్థి మునుగొండ వెంకటముత్యం మండలంలో బుధవారం ప్రచారం చేశారు. చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లో సభ ఏర్పాటు చేసి మాట్లాడారు. సీతాయిగూడెం, చంద్రుగొండ గ్రామాల్లో తొలుత ద్విచక్రవాహనాల ర్యాలీ నిర్వహించారు. చంద్రుగొండలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. నాయకులు బేతి సోమయ్య, రాజిన్ని వెంకటేశ్వర్లు, సీతారాములు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌లో చేరానని, భద్రాచలం నియోజకవర్గ పార్టీ అభ్యర్థి డాక్టర్ తెల్లం వెంకట్రావును గెలిపించాలని రావులపల్లి రాంప్రసాద్ అన్నారు. బుధవారం లక్ష్మీనగరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న భద్రాచలంలో జరుగనున్న కేటీఆర్ రోడ్ షోకు అందరూ హాజరుకావాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి, ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, నాయకులు పాల్గొన్నారు.

చర్లరూరల్: భద్రాచలం నియోజకవర్గం బీఆర్‌యస్ అభ్యర్థి తెల్లం వెంకట్రావును గెలిపించాలని కోరుతూ.. ఆ పార్టీ నాయకులు బుధవారం పాత చర్ల, పూజారిగూడెం ఏరియాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో చర్ల సర్పంచ్ కాపుల కృష్ణార్జున రావు, చింతా నాగబాబు, కాకి అనిల్, అలవాల బాలు, సోయం కృష్ణవేణి, పోలూరి సుజాత, ఇర్సవడ్ల రాము, బోళ్ల వినోద్, గద్దం సాయి, బొజ్జ ప్రశాంత్, రామగిరి అరుణ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో జనసేన, బీజేపీ బలపరిచిన అభ్యర్థిని ముయ్యబోయిన ఉమాదేవి బుధవారం అశ్వారావుపేటలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దేగల రాము, మెట్టా వెంకటేష్, చందు, సురేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే భద్రాచలం అభివృద్ధి

భద్రాచలం: భద్రాచలం అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ఉమ్మడి ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన ఇటీవల పార్టీలో చేరిన రావులపల్లి రాంప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. భద్రాచలం అభివృద్ధికి కేసీఆర్ ఆధ్వర్యంలో కట్టుబడి ఉన్నామని అన్నారు. రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ... తను అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా పేర్కొంటు వెలువడిన లేఖ వెనుక పొదెం వీరయ్య హస్తం ఉందని ఆరోపించారు. సమావేశంలో మల్లెల రవిచంద్ర, గూడపటి శ్రీను, బీఆర్ఎస్ మండల అధ్యక్ష కార్యదర్శులు అరికెల తిరుపతిరావు, కృష్ణ మూర్తి, నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఏం చేసింది?

భద్రాచలం: పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉండి బీఆర్ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి ఏం చేసిందని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాలసాని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పొదెం వీరయ్యపై బీఆర్ఎస్ నాయకుడు తాతా మధు చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు.

ఓటు హక్కు వినియోగంపై కళాజాతా

బూర్గంపాడు: ఓటు హక్కు వినియోగంపై బుధవారం బూర్గంపాడులో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. సమాచార ప్రచారశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలచారి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమన్నారు. కళాజాతా బృందం సభ్యులు ఆటపాటలతో ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు.



బూర్గంపాడు: కళాజాతా ప్రదర్శన..